# ముక్కు తెచ్చిన చిక్కు



పోలాప్రగడ రాజ్యలక్ష్మి

''హలో కిరణ్‌గారూ!''

మధురమైన వలపులో మాటల తియ్యదనం మెదిపి, మెత్తగా గుండెని గేలమేసి లాగినట్లు వినిపించిన ఆ పిలుపు వచ్చిన వైపు తిరిగి చూశాడు కిరణ్.

చేతిలో పుస్తకాలు, మెడలో స్టైత స్కోపు, మేచ్ అయిన నీలిరంగు చీరా బ్లౌజు వేసుకుని, చిరునవ్వు నవ్వుతూ అల వోకగా చూస్తూ తన కోసం వరండా చివర వేచి వుంది కిశోరి.

అనుమానం లేదు. తనని పిలిచింది కిశోరే!

'కిశోరి! తనని పిలవడమా!'

కిరణ్‌కి ఆనందంతో శరీరం అంతా పులకలు తేరింది.

ఏడాది క్రితం తనతోపాటుగా ఈ హాస్పటల్లో హౌస్ సర్జన్‌గా చేరిన కిశోరిని పలకరించాలని, నిజానికి ఈ ఏడాదిలోనూ తను కనీసం మూడు వందలసార్లయినా ప్రయత్నించాడు. ప్రతీ మాటూ ఏదో ఒక ఇబ్బందీ, ఏదో ఒక అడ్డంకూ...

ఓమారు చంద్రబింబంలాంటి ఆమె గుండ్రని ముఖం చూసి, ఆ అందంలో పరవశించిపోయి, పలకరించడం మరచిపోయాడు.

మరోమారు చక్రాల్లాంటి ఆమె కళ్ళల్లో కనిపించిన కాంతి చూసి, ఆశ్చర్యంతో ఆ మట్టున వుండి పోయాడు.

ఇంకో మారు సన్నజాజి తీగలాంటి ఆమె సుకుమారమైన రూపం, మరోమారు హంసల్నీ, నెమళ్ళనీ తలపించే ఆమె వయ్యారపు నడకా-ఇలా ఆమెలోవున్న వందలాది అందాలు ఒక్కొక్క మాటు ఒక్కొక్కటి తనని మరపించి, మురిపించి, మాట్లాడ్డం చేతకాని మూగవాణ్ణి చేస్తూ వచ్చాయి.

అన్ని అందాలూ ఒక ఎత్తు...సంపెంగలా కొద్దిగా ఒంపుదిరిగిన ఆ అందమైన ముక్కు ఒక్కటే ఒక ఎత్తూ. అసలామె ఆకర్షణ అంతా ఆ ముక్కులోనే వుందేమో. ఓ రకంగా చెప్పాలంటే ఆమె ముక్కే తనని మూగవాణ్ణి చేస్తోంది ప్రతిమాటూ.

ఈ ఆకర్షణలన్నీ అదుపులో పెట్టుకొని, గొంతు సవరించుకొని, పెదిమలు తడి చేసుకుని, ఎల్లాగో అల్లాగ ధైర్యం చేసి ఓ రోజున మాట్లాడబోతే, మధ్యలో ఎవరో పలకరించడం, మరో సైంధవుడెవరో మాటకి అడ్డు రావడం.

ఇలా గడిచిపోయింది ఏడాది అంతా.

మనసు దొంగిలించిన ఆ పుత్తడి బొమ్మని ఒక్కమారు...ఒక్కమారైనా పలకరించడం పడలేదు.

పలకరించే అవకాశం రాక, మనసులోంచి ఆమె రూపం చెదిరిపోక, ఎన్ని రాత్రులు ఎన్ని పగళ్ళు తను అశాంతిగా ఆరాటంతో కాలం గడిపాడో!

రూమ్‌కి వెళితే ఆమె ఆలోచన!

పుస్తకం తెరిస్తే ఆమె రూపం!

కళ్ళు మూసుకుంటే ఆమె చిరునవ్వు!

తనని వెంటాడి వెంటాడి చివరికి ఆమె తలపులు, తనకి పిచ్చెక్కించేస్తాయేమోనని భయపడ్డాడు.

ఆమెని మరిచిపోనూలేదు, అలాగని ఆమెని పలకరించా లేదు.

అందుకే ఆమె మీద ఊహించుకొన్న మరులన్నీ అక్షరాలుగా మార్చి కవితలల్లడం మొదలెట్టాడు. అవి అటుతిప్పి ఇటుతిప్పి, మార్చి మార్చి రాసేసరికి, చక్కని కవితా ఖండాలుగా తయారయాయి. ఆ ప్రేమ గీతాల్లో ప్రేయసిని 'కిశోరి' అంటే ఏం గొడవ వచ్చి పడుతుందో అని భయపడి, చివరికి కిశోరికి దగ్గరగా వున్న 'చకోరి' అనే పేరుని ఎంచుకున్నాడు.

ఊహా ప్రేయసి 'చకోరి'ని గురించి రాసిన ప్రేమ గీతాలు, ఒక్కొక్కటే పత్రికల్లో పడడం ప్రారంభించాయి. అభినందనలు రాసాగాయి.

దాంతో గీతం తర్వాత గీతం, రచన తర్వాత రచనా, క్షణం తీరిక లేకుండా అయిపోయింది తన పరిస్థితి. ఊహా సుందరి చకోరి ధ్యాసలో పడిపోయి, వాస్తవ ప్రపంచంలో వున్న కిశోరి సంగతి విస్మరించి, ఆమె ఎదురైనా, చిరునవ్వు నవ్వినా, కళ్ళతో పలకరించినా,

అవేవీ పట్టించుకోకుండా, మరో లోకంలో వున్నట్టు కవితా లోకంలో భావ విహంగాలమీద విహరిస్తూ, పరధ్యానంగా, అదో రకం మత్తులో వుండిపోయాడు కిరణ్.

'ఇవాళ పిలిచినట్లు ఇంత క్రితం ఎన్ని మార్లు పిలిచిందో ఏమో కిశోరి! తను పిచ్చి మొహంలా వినిపించుకోలేదు కాబోలు!

సందేహంలేదు. పిలిచింది కిశోరే!

నిజంగా? నిజంగానా?' అతని కాళ్ళు అలా అలా యాంత్రికంగా ఆమె వైపు నడిచి వెళ్ళాయి.

"కంగ్రాట్యులేషన్స్! మీ కవితలు చదువుతున్నా. బాగుంటున్నాయి. లేటెస్ట్‌ది మరీను. నిన్న అది చదవగానే ఫోను చేశాను మీకు, అభినందనలు చెబుదామని. పలకలేదు" అంది కిశోరి వయ్యారంగా ఊగుతూ, అతని కేసి గోముగా చూస్తూను.

ఆమె అన్న మాటలేవీ కిరణ్‌కి వినిపించలేదు.

అతనికి వినిపించిందల్లా ఒక మధురమైన వీణా నాదం. ఒక కోకిల స్వరం. ఒక తియ్యని జలపాతం సవ్వడి.

ఆనంద సాగరంలో మునిగిపోతూ, ఆమె మాటల మాధుర్యంలో కరిగిపోతూ, తన వునికిని పూర్తిగా మరిచి, వెన్నెల్ని త్రాగుతూ వుండిపోయిన చకోర పక్షిలా ఆ మట్టున అలా నిలబడిపోయాడు స్థాణువులా, ఆమెకేసి గుడ్లప్పగించి చూస్తూ.

'అదేవిటి అలా వుండిపోయాడు! ఆ చూపు ఏవిటి? ఎరక్కపోయి పలకరించాను కదా ఇతన్ని?' అనుకొని కాస్సేపు ఇబ్బందిపడి, తర్వాత కోపంతో బుంగమూతి పెట్టి, కోరగా చూసి, విసవిసా నడిచి వెళ్ళిపోయింది కిశోరి, ఆ విసురు నడకలోనే వెయ్యి ఒయ్యారాలు ఒలికిస్తూ.

తర్వాత అయిదు నిమిషాలకి కాని, కిరణ్ తేరుకోలేదు. ఒక్కమారు తల విదిలించి చూస్తే, కిశోరి లేదు! వెళ్ళిపోయింది. 'ఎంత వెర్రిపని చేశాను. ఎన్నాళ్ళనుంచో ఎదురుచూస్తున్న బంగారంలాంటి సన్నివేశం అనుకోకుండా ఎదురైతే, చేజేతులా వదులుకున్నాడు తను! ఆప్యాయంగా పలకరిస్తే అనురాగంతో సమాధానం చెప్పకుండా మూగవాడిలా వుండిపోయాడు. ఎంత డాక్టరీ చదివితే ఏంలాభం, ఎన్ని కవితలు అల్లితే ఏం ప్రయోజనం! సమయస్ఫూర్తి లేకపోయాక-ప్చ్.

'మళ్ళీ ఇలాంటి అవకాశం వస్తుందా?

వస్తే మాత్రం తను మాట్లాడగలడని నమ్మకం ఏదీ? మళ్ళీ నీరైపోతాడు. ఏవిటో! ఎంతమంది స్నేహితులతోనో రాజకీయాలమీద, సాహిత్య విషయాల మీదా గంటలుకొలదీ లెక్చర్లు దంచేసేవాడు. కిశోరి కనిపిస్తే నోరు పెగలదు. ఆలోచన స్ఫురించదు. మెదడు పనిచెయ్యక మూగవాడిలా వుండిపోతాడు.

'ఏమైనా సరే. ఈమారు అలా అయిపోగూడదు. జమాయించి మాట్లాడాలి. గుండెల్లో వున్న ప్రేమంతా మాటల్లో పొంగి పొరలేలా మాట్లాడేసెయ్యాలి. తన మమతల కడలిలో ఆమె కరిగిపోవాలి. ఆ తర్వాత వచ్చి తన ఒడిలో వాలిపోవాలి. ఆ...అంతే!'


ఇలా ఓ నిర్ణయానికి వచ్చి, మర్నాటి నుంచీ, కిశోరిని అనురాగం పుట్టిపడేలా ఎలా పిలవాలో, ఎలా సంభాషణ సాగించాలో రకరకాల డైలాగులు రాసుకుంటూ, వాటికి తగిన అభినయాన్నీ, ముఖ భంగిమల్నీ మార్చి మార్చి చూసుకుంటూ, నిలువుటద్దం ముందు గంటల కొద్దీ నిలబడి, రిహార్సల్స్ వేసుకోసాగాడు కిరణ్.

ఇప్పుడు తన ఊహల్లో కిశోరి కిశోరికాదు. ఆమె ఒక ప్రణయాధి దేవత, ఒక శృంగార రస ప్రవాహం. తన భావకవితా విహంగం.

అవును. ఆమె కిశోరి కాదు. చకోరి!

"చకోరీ!" అంటూ వెర్రి ఆవేశంతో అరిచాడు కిరణ్. వరండాకి ఆ చివర నుంచి వార్డులోకి వెళుతూన్న కిశోరి ఆ అరుపుకి అదిరిపడి అతనికేసి చూసింది. వార్డులోకి వెళ్ళిపోతున్న ఆమెని చూసి, మళ్ళీ అలాగే అరిచి, గబగబా ఆమెకేసి పరుగులాంటి నడకతో వడివడిగా అడుగులు వేశాడు.

కిశోరి ఆగి ఇటూ అటూ చూసి "ఎవరినండీ పిలుస్తున్నారు? ఇక్కడెవరూ లేరే!" అంది విస్తుబోయి అతనికేసి చూస్తూ.




ప్రముఖ ఈలపాట కళాకారుడు శ్రీ కె.శివప్రసాద్ శాస్త్రీయ సంగీతాన్ని పలికించిన తన ఈలపాట ఎల్.పి. రికార్డు ను ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావుకు బహూకరిస్తున్న దృశ్యం

"మిమ్మల్నే నండీ!" అన్నాడు కిరణ్, పూనకం వచ్చిన వాడిలా ఊగిపోతూ, ఆయాసంతో ఒగుర్చుకుంటూ.

"బలేవారే! ఆ పేరుకి నే నెలా పలుకుతాను?" అంది కిశోరి ముఖం చిట్లించి.

"మీకు నేను ప్రత్యేకంగా పెట్టుకున్న పేరండీ అది" అన్నాడు కిరణ్ ఎంతో అమాయకత్వంతో, ముఖంలో నిజాయితీ వుట్టి పడుతూంటే.

కిశోరి ఆశ్చర్యంగా కళ్ళు అంతలేసి చేసి చూసి అంతలోనే వస్తూన్న నవ్వుని ఆపుకుంటూ "ఏవిటి? నాకాపేరు మీరు పెట్టారా? చాల్లెండి" అంది.

"అది కాదండీ...ఆ పేరు నాకిష్టం"

"ఇష్టం అయితే మీ కవితా సుందరికి పెట్టుకోండి. అంతేకాని నన్ను చకోరి, వికారి అని పిలిస్తే బాగుండదు. అయినా, ఎవరేనా వింటే ఏమనుకుంటారు?" అంది కిశోరి చిరుకోపం నటిస్తూ.

"సారీ అండీ! నాకవితా సుందరికే అసలు ఆ పేరు పెట్టుకున్నది. కాని మిమ్మల్ని నా కవితా సుందరిగా ఊహించుకొని..."

"ఏమిటీ!" తమాషాగా కళ్ళు తిప్పుతూ అంది కిశోరి.

ఆ చూపుకి మొదట పులకించిపోయి, తర్వాత భయపడిపోతూ..."అహహ...నేను చెప్పదలుచుకున్నది ఏవిటంటే...అసలు నేను కవిత్వం రాయడానికి కారణం..." అంటూన్న కిరణ్‌ని చూసి, మనస్సులోనే నవ్వుకొని, పైకి గంభీరంగా..."ఊ...కారణం...? నేను కాదుకదా కొంపదీసి?" అంది కిశోరి.

పట్టలేని ఆనందంతో "యగ్జాక్ట్లీ కరెక్ట్ అండి" అన్నాడు కిరణ్ ఎగిరి గంతేసినంత హడావుడి చేసి.

కిశోరి గుండె ఝుల్లుమంది.

అలవోకగా అతనికేసి చూసి హంసలా లాన్‌లోకి నడిచి వెళ్ళింది. చూపులో అనురాగమేకాని, ఆగ్రహం లేదు. 'నోరుజారి తీరా చేప్పేశాను...ఆమె ఏం కోపం తెచ్చుకుంటుందో! ఏం అల్లరి పెడుతుందో' అని భయపడుతూన్న కిరణ్‌కి, ఆమె అలా తనకేసి అలవోకగా చూడ్డంతో, హమ్మయ్య అని గుండె దిటవు ఏర్పడింది.

ఆమె లాన్‌లోకి వెళ్ళింది.

తను ఆమెని అనుసరించి వెళ్ళడమా మానడమా తటపటాయించాడు.

లాన్‌లో కూర్చోబోతూ, కిశోరి వెనక్కి తిరిగి విసిరిన చిరునవ్వు, కిరణ్‌లోని అనుమానాన్ని పటాపంచలు చేసింది. అంతే-రెండు అంగల్లో తను కూడా లాన్లోకి పరిగెట్టాడు.

ఇద్దరూ ఆ పచ్చిక బయలులో ఒకరి కొకరు ఎదురెదురుగా కూర్చున్నారు. అతనికేసి ఆమె పరిశీలనగా-ఆమెకేసి అతను కోటి కోరికలతో భయం భయంగా-వున్నట్టుండి ఆమె పకపకా నవ్వేసింది. అతను కూడా నవ్వేస్తూ "అబ్బ! ఎంత భయపెట్టేశా రండీ!" అన్నాడు.

"అవును గానీ, మీరు నా అనుమతి తీసుకోకుండా మీ ఊహా సుందరిగానూ, మీ కవితా సుందరిగానూ

భావించెయ్యడం నామీద కవితలల్లడం, నా పేరు కూడా మా అమ్మా నాన్నా పెట్టిన కిశోరి తీసేసి, చకోరి అని కొత్త పేరు ఏదో పెట్టడం, ఇవన్నీ చెయ్యొచ్చా?" అంది.

"ఏవండీ తప్పా?" అన్నాడు అమాయకంగా.

"తప్పేవిటి? చట్ట ప్రకారం నేరం కూడా" అంది సీరియస్‌గా కిశోరి.

"నే...ర...మా?" అని అడిగాడు కిరణ్ ఆశ్చర్యంగా.

అతని అమాయకత్వానికి నవ్వుకుంటూ, "ఆహా... అక్షరాలా నేరమే! అదేం సెక్షన్ చెప్మా...?...ఆ... నూట తొంభయి తొమ్మిదో సెక్షన్ ప్రకారం, అది చాలా పెద్ద నేరం క్రింద లెక్కట. మా నాన్నగారు చెప్పారు" అంది కిశోరి.

"మీ నాన్నగారు లాయరాండీ..."

"అఫ్‌కోర్సు...నన్ను కూడా లాయర్ని చేద్దాం అని చూశారు. కాని మా అమ్మగారు అడ్డుకున్నారు. నాకూ లాయర్ కావడం ఇష్టంలేదనుకోండి. మా అమ్మగారిలాగ డాక్టర్ అవాలనే నాకు చిన్నప్పటి నుంచీ కోరిక..." అవసరం లేకపోయినా గడగడా చెప్పేసింది.

"నష్టం కాక ఏవిటండీ...మన ఇద్దరం ఇలా మాట్లాడు కుంటూంటే నాకు ఎంత ఆనందంగా వుందో చెప్పలేను. మీకు అభ్యంతరం లేకపోతే రోజుకి ఒకమారైనా నాతో మీరు ఇలా కబుర్లు చెబితే..."

"ఊ...చెబితే...? ఆ తర్వాత చనువు పెంచేసి సినిమాలకనీ, బీచ్‌లకనీ రమ్మనడం, విడదీయరాని స్నేహాన్ని కల్పించడం, ఇలా ఇలా పరిస్థితిని పెంచెయ్య వచ్చు మీరు..."

"అబ్బెబ్బె...అలాంటివేం అనుకోకండి...మీ యిష్టం లేకుండా ఒక్కరోజు కూడా మీరు నాతో రావద్దు సరా?"

"అలా హద్దుల్లో వుండేమాటయితే అభ్యంతరం లేదు."

"ఒక చిన్న కోరిక." బెదురుతూ అడిగాడు కిరణ్.

ఏవిటన్నట్లు చూసింది కిశోరి.

"వచ్చే ఆదివారం ఓ అరగంట సరదాగా కబుర్లు చెప్పుకుందాం, ఉమెన్స్ హాస్టల్‌కు దగ్గరున్న బీచ్‌లో కూర్చుని..."

"అదిగో చూశారా చనువు పెంచేస్తున్నారు"



అక్టోబర్ 19వ తేదీన తిరుపతిలో జరిగిన 'కామధేను' సచిత్ర వార పత్రిక ప్రారంభోత్సవ దృశ్యం. ఆవిష్కరించిన చిత్తూరు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ ఆర్. రాజశేఖర్ రెడ్డి, అధ్యక్షులు శ్రీ విద్వాన్ విశ్వం, ఎడిటర్ శ్రీ యస్.ఆర్.ఎమ్. సింగ్, ఇండియన్ బాలె థియేటర్ అధినేత మాస్టర్ రమణ, శ్రీ పులి కంటి కృష్ణారెడ్డి, ముఖ్య అతిథి శ్రీ శర్మలను చూడవచ్చు.

"మైగాడ్! మీ అమ్మగారు డాక్టరా? మన కె.జి.హెచ్.లోనే?"

"ఆవిడది ప్రైవేట్ ప్రాక్టీసు లెండి. ఆమె ఎప్పుడూ కె.జి.హెచ్.కి రాలేదు. మీరు చూసి వుండరు."

"అదీ-అలా చెప్పండి. అయితే మిమ్మల్ని లాయరు చెయ్యాలని మీ నాన్నగారూ, డాక్టర్ని చెయ్యాలని మీ అమ్మగారూ పోటీ పడ్డారన్నమాట. మొత్తానికి మీ అమ్మగారే నెగ్గారు. ఆవిడ మాట నెగ్గడం కూడా మంచిదే అయింది."

"ఎందుకుట?" అంటూ కిశోరి సోగ కన్నులతో అతనికేసి చూసింది.

"ఎందుకేవిటండీ! మీరు మెడిసిన్ చదవకపోతే మిమ్మల్ని నేను చూడ్డం కానీ కలుసుకోవడంకానీ ఇలా సంతోషంగా కబుర్లు చెప్పుకోవడం కానీ ఇవేం జరిగి వుండకపోను"

"ఇవన్నీ జరిగి వుండకపోతే ఏం? ఏమిటి నష్టం?" పైట చెంగు చివర పట్టుకుని, గాలిలో ఇటూ అటూ కదుపుతూ వయ్యారంగా అడిగింది కిశోరి.

కిరణ్ కంగారుగా "అహ...మీకు ఇష్టం అయితేనే..." అన్నాడు.

కిశోరి కాస్సేపు ఆలోచించినట్లు నటించి, తల పంకించి, "సరే...ఓ...కే...అయితే చీకటి పడకుండా నేను ఇంటికి వెళ్ళిపోవాలి...మా నాన్నగారు మహా స్ట్రిక్ట్. ఆరు అయేటప్పటికి ఇంటికి చేరుకోకపోతే ఊరుకోరు. స్నేహితులతో తిరగడం అన్నా, వాళ్ళతో మాట్లాడ్డం అన్నా మండిపడతారు. లేడీ ఫ్రెండ్స్ అంటేనే కోరగా చూస్తారు. మేల్ ఫ్రెండ్స్‌తో బీచ్‌లో తిరుగుతున్నానని తెలిస్తే ఇంకేమైనా వుందా?" అంది గుండెలమీద చెయ్యి వేసుకుని భయం భయంగా.

"అలాగే...ఒక్క అరగంట మాట్లాడుకోవడం అయ్యాక వెళ్ళి పోదురుగాని. చీకటి పడకుండా... ఏం?" అన్నాడు కిరణ్. వీణలో సన్నని తీగెని మీటినట్లు ఊ అంది కిశోరి...

రామకృష్ణ బీచ్‌కి కొంచెం దూరంలో ఇసుకలో కూర్చున్నారు ఇద్దరూ. ఇద్దరి మనస్సులలోనూ ఏదో మధురమైన తియ్యని ఇబ్బంది. ఇద్దరి శరీరాల్లోనూ సన్నని ప్రకంపన. ఇద్దరి ముఖాల్లోనూ సంతృప్తితో కూడిన ఆనందం, ఆరాటం. ఏదో మాట్లాడాలని ఇద్దరికిద్దరూ తలఎత్తి చూడ్డం, మళ్ళీ సంకోచమో, సిగ్గో అడ్డువచ్చి, ఆ చూపుల్ని పక్కలకి తిప్పుకుని, ఇసుకలో గీతలు గీస్తూ కూర్చోవడం.

అదురుతూన్న గుండెల్నీ పెదిమల్నీ అదుపులో పెట్టుకోలేక, మధ్య మధ్య బరువైన కను రెప్పలు ఎత్తి, కిరణ్‌కేసి చూసి, మళ్ళీ అంతలోనే దించేసుకుని కిశోరి ఇబ్బంది పడుతూంటే, చీరలోని ఆమె అందాల్నీ, గోళ్ళు కొరుక్కుంటూ కూర్చున్న ఆ తీరులోని వయ్యారాన్నీ చూస్తూ గుటకలు వేస్తున్నాడు కిరణ్.

కాలం నిమిషాలమీద గడిచిపోతోంది.

సంధ్య చీకట్లు కమ్ముకొంటున్నాయి.

బీచ్‌లో జనం బాగా పల్చబడ్డారు.

కిరణ్‌కి, కిశోరికి సమీపంలో ఎవ్వరూ లేరు. దూరంలో ఒకటి రెండు జంటలున్నా ఆ చీకట్లో కనిపించడంలేదు. అటు పట్నం, ఇటు సముద్రం మధ్యలో మసక వెలుతురులో తామిద్దరూ-

ఇద్దరిలోనూ కట్టలు తెంచుకుని వస్తున్న ఆవేశం. మధురమైన ఆలోచనలతో మత్తెక్కిస్తూన్న పరవశం, జ్వాలలా శరీరంలో అణువణువునీ వ్యాపించి, మహా చైతన్యాన్ని సృష్టిస్తూన్న ఉత్తాలమైన ఉద్వేగం!

"కి...శో...రీ!" అన్నాడు కిరణ్ వణుకుతూన్న కంఠంతో.

"ఊ..." అంది కిశోరి గొంతులో కోటి కిన్నెరలు పలికిస్తూ...

"మనస్సులో వున్నమాట చెప్పనా?"

"ఊ..."

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను"

కిశోరి గుండె ఝల్లుమంది. వంట్లో రక్తం అంతా ముఖంలోకి వచ్చినట్లయి, బుగ్గలు రెండూ విరిసిన గులాబీ మొగ్గలయ్యాయి. సిగ్గుతో తల దించేసుకుని, రెండు చేతుల్లోనూ ముఖం దాచేసుకుంది...

"నీకు ఇష్టంలేదా?" ఎంతో ఆవేదనతోనూ మరెంతో ఉద్వేగంతోనూ అడిగాడు కిరణ్.

'ఇష్టమే!' అన్నట్లు తల ఊపింది కిశోరి...

పట్టలేని సంతోషంతో "నిజంగా...? నిజంగానా" అంటూ ఆమెకి దగ్గరగా, మరింత దగ్గరగా జరిగి ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుని ముద్దెట్టుకున్నాడు.

పూల చెట్టుని కుదిపినట్లయింది కిశోరి మనస్సు.

"కిశోరీ...నా కిశోరీ..." అంటూ ఆమెని ముద్దుల్లో ముంచేస్తూ, వివశుడై తనని తాను మరిచి పోయాడు కిరణ్. అతని చేతుల్లో నలిగిపోతూ, అతని ముద్దుల్లో మునిగిపోతూ, ఈ లోకాన్నే మరిచిపోతోంది కిశోరి.

అతను కిరణ్ కాదు.

ఆమె కిశోరి కాదు.

ఇద్దరూ కలిసి ఇప్పుడు అవధులెరుగని ఆవేశం! నింగికెగసిపడుతూన్న ఒక మహోజ్వలమైన జ్వాల! ఒక రస ప్రవాహం...

"ఏం లేదుసార్! ఏడాది నుంచి కిశోరి ప్రేమ కోసం ఎంతో ఆవేదనతో ఎదురుచూశాను. కవితలు కూడా అల్లాను. ఆమె నా ప్రేమని అంగీకరించేసరికి సంతోషంతో వళ్లు తెలియక హద్దులు మీరి ప్రవర్తించి వుంటాను. పొరబాటయిపోయింది. చంద్రబింబం లాంటి ఆమె ముఖానికి మచ్చ తీసుకు వచ్చాను. ఆ నేరానికి నేను చాలా బాధపడుతున్నాను. మీరే శిక్ష విధించినా సరే" అంటూ తల వంచాడు కిరణ్.

"అమ్మా! నువ్వు చెప్పేది ఏదైనా వుందా?" అన్నారు జడ్జిగారు కిశోరి వైపు తిరిగి.

చాలా సేపటి వరకూ కిశోరి నోట్లోంచి మాటే ఊడిపడలేదు. సిగ్గుతో తలవంచుకుని ఆ మట్టునే నిలబడివుంది. జడ్జీగారితోబాటు కోర్టులో వున్న జనం యావన్మందీ ఆమె ఏం చెప్తుందా అని నిశ్శబ్దంగా వేచి వున్నారు.

చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దం.

చివరికి ఎలాగో అలాగ బలం అంతా కూడదీసుకుని తల ఎత్తకుండానే "కిరణ్‌గారు చదువుకున్నవారూ, సంస్కార వంతులూను. ఆయన నన్ను గాఢంగా ప్రేమించారు. నా మీద కవితలు కూడా అల్లారు... ఏదో ఆవేశంలో ఆయన చేసిన ఈ చిన్న పొరబాటుకి ఇంత రాద్ధాంతం చేసి కోర్టుదాకా పిలిపించి అల్లరి చేసినందుకు మానాన్నగారి తరఫునా, మా అమ్మగారి తరఫునా నేను పశ్చాత్తాప పడుతున్నాను. వారిని క్షమించవలసిందిగా కోర్టు ముఖంగా కోరుకుంటు




న్నాను" అంది నెమ్మదిగా.

అంతా హర్షధ్వానాలు చేశారు.

కిశోరి తండ్రి మాత్రం ఉవ్వెత్తుగా కుర్చీలోంచి లేచి, "నో-యువర్ ఆనర్! కేసుని ఉపసంహరించుకోడానికి ఫిర్యాదికి హక్కు వున్నా, ఆ ఫిర్యాదీ తండ్రిగానూ, సంరక్షకుడిగానూ, నాకు కొన్ని బాధ్యతలూ, హక్కులూ వున్నాయి. ఆమెకి నేను పెళ్లి చెయ్యాలి. ముక్కు మాటి పిల్ల పట్ల అమ్మాయిని పెళ్లి చేసు కోవడానికి అన్నివిధాలా యోగ్యుడైన వరుడెవరూ ముందుకి రాకపోవచ్చు. ఈ విషయాన్ని కూడా జడ్జీగారు కేసు విచారణలో ముఖ్యమైన అంశంగా పరిగణించాలని ప్రార్థన" అన్నాడు.

"అన్ని అంశాలూ పరిశీలించే ఇస్తాను జడ్జిమెంటు" అంటూ జడ్జీగారు ధర్మాసనంమీంచి లేచారు.

అది ముక్కు కేసుకి సంబంధించి జడ్జిమెంటే ఇచ్చే రోజు. అందరితోబాటు, ఆ ఊళ్ళో వున్న యువకులూ, యువతులూ కోర్టు లోపలా కోర్టు బయటా కిటకిటలాడుతూ నిలబడి వున్నారు. జడ్జీగారు తీర్మానం చదవనారంభించారు. "ఫిర్యాదీ, ముద్దాయీ మైనారిటీ తీరిన వ్యక్తులు. పైగా వారిద్దరూ పరస్పరం ప్రేమించుకున్నారు. ముక్కు కొరికాడని ఫిర్యాదీకి కోపం లేదు. అయితే ఫిర్యాదీ తండ్రి తన కుమార్తె పెళ్ళి ఎలాగ అనే బాధతో ముద్దాయికి శిక్ష పడాలని కోరుకుంటున్నారు. అందువల్ల ముద్దాయికి శిక్ష వెయ్యక తప్పడం లేదు. అతనికి శిక్ష ఏమిటంటే, అతను ఫిర్యాదీని పెళ్ళి చేసుకోవాలి. అయితే, ఏ తొందరపాటు సమయంలోనూ, ఆమె ముక్కు మాత్రం కొరకడానికి వీల్లేదు."

జడ్జిమెంటు వింటూనే కోర్టు కోర్టు అంతా నవ్వులతోనూ, చప్పట్లతోనూ, మార్మోగిపోయింది. కిశోరి తండ్రి జయించినట్లు గర్వంగా మీసం తిప్పుకున్నాడు. అయిష్టంగా తల్లి మాత్రం మూతి తిప్పుకుంది. కిరణ్, కిశోరి మాపులు రెండూ కలిసి నవ్వుకున్నాయి.

